# అక్షయ పాత్ర

అక్షయపాత్ర ఒక అనంతమైన సమృద్ధి గల శక్తివంతమైన పాత్ర. దీని నుంచి మనం ఎంత శక్తిని లేదా సంపదను తీసుకుని ఉపయోగించినప్పటికీ, ఇది ఎల్లప్పుడూ అపరిమితమైన శక్తిని మరియు సమృద్ధిని అనంతంగా కలిగి ఉంటుంది. ఈ అక్షయపాత్ర గురించి ఆధ్యాత్మికతలోను (అద్వైత వేదాంతంలో) మరియు క్వాంటం భౌతిక శాస్త్రంలోను కూడా చెప్పబడింది.

అద్వైతం మరియు క్వాంటం ఫిజిక్స్ రెండూ అపరిమిత సమృద్ధి గురించి ఏమని వివరిస్తున్నాయో ఇప్పుడు చూద్దాం. మనం ఈ విశ్లేషణను అక్షయ పాత్రతో పోల్చవచ్చు.

## 1. అద్వైత వేదాంతం: అపరిమిత శక్తి మరియు సమృద్ధి

అద్వైత వేదాంతంలోని ముఖ్య సూత్రం - ద్వంద్వాలు లేవు ఉన్నది ఒకే ఒక్క వాస్తవం, అది అఖండమైన బ్రహ్మమేనని, అలాగే వ్యక్తిగత-స్థితి లేదా జీవాత్మ అనేది బ్రహ్మం నుండి ఎప్పటికీ వేరు కాదు. వ్యక్తిగత చైతన్యం(జీవాత్మ) మరియు విశ్వం(పరమాత్మ) మధ్య విభజన ఉన్నట్టు కనిపించడం లేదా అనిపించడం అంతా కూడా ఒక భ్రమ, లేదా మాయ మాత్రమే నని బోధిస్తుంది.

**అద్వైత సిద్ధాంతం, అపరిమిత సమృద్ధి యొక్క భావనను ఎలా సమర్థిస్తుందో ఇక్కడ చెప్పుకుందాం:**

**అపరిమిత శక్తి మరియు సమృద్ధిగా ఉన్నది - బ్రహ్మమే(పరమాత్మ):** అద్వైతం ప్రకారం, ఈ సమస్త సృష్టిలో ఉన్న ప్రతీది కూడా - అనంతమైన, శాశ్వతమైన మరియు పూర్ణమైన బ్రహ్మం యొక్క వ్యక్తీకరణయే. పరమాత్మ - కాలం, ప్రదేశం లేదా పరిమితులకు అతీతమైనవాడు; సమస్త శక్తులు, సమృద్ధి మరియు సృష్టి అంతటికి మూల కారణమైనవాడు. జీవాత్మ బ్రహ్మంతో ఏకమైనప్పుడు, వాస్తవం యొక్క లోతైన స్థాయిలలో శక్తి లేదా సమృద్ధి యొక్క కొరత అన్న ప్రశ్నే తలెత్తదు. ఎలాగైతే అక్షయ పాత్రలో ఆహారం ఎప్పటికీ తరిగిపోదో, అలాగే బ్రహ్మం యొక్క అనంతమైన సమృద్ధి ఎల్లప్పుడూ జీవాత్మకు అందుబాటులో ఉంటుంది. ఆధ్యాత్మిక శక్తి, భౌతిక వనరులు(ఆస్తులు లేదా వస్తువులు) లేదా సంపద ఏదైనా కూడా మీరు ఎంత వినియోగించినా లేదా ఉపయోగించినా, అంతగా అది ఎల్లప్పుడూ అపరిమితంగా అందుబాటులో ఉంటుంది, ఎందుకంటే అవి శాశ్వతమైన మరియు అక్షయమైన బ్రహ్మం నుంచే లభిస్తున్నాయి కనుక.

**లాభం లేదు, నష్టం లేదు:** అద్వైతం ప్రకారం, భౌతిక ప్రపంచానికి సంబంధించిన శక్తి, సంపద లేదా మరి ఏ విషయమైనా(ఆరోగ్యం, బంధాలు, ఉద్యోగం, డబ్బు) పొందడం లేదా కోల్పోవడం, గెలవడం లేదా ఓడిపోవడం అనే అనుభవాలన్నీ కూడా అహంకారం మరియు ద్వంద్వ భ్రమ(ద్వైత భావన) యొక్క ఫలితాలే. వాస్తవానికి లాభం లేదు, నష్టం లేదు. ఎందుకంటే ప్రతీది బ్రహ్మంలో భాగమే కనుక. ఆత్మ ఈ మార్పులకు అతీతంగా ఉంటుంది. మీరు పరమాత్మతో మీ ఏకత్వాన్ని గ్రహించినప్పుడు, నిజానికి అసలు మీరు ఏదీ కోల్పోలేదని లేదా పొందలేదనే మూల సత్యాన్ని గ్రహిస్తారు. అప్పుడు శక్తి, డబ్బు, సంపద లేదా మరేదైనా పొందడం లేదా కోల్పోవడం యొక్క లాభ-నష్టాల భావనలన్నీ కేవలం ఒక భ్రమ మాత్రమేనని తేలిపోతుంది.

**ఏకత్వాన్ని అర్థం చేసుకోవడం ద్వారా సమృద్ధి:** మీరు ఎప్పుడైతే అనంతమైన బ్రహ్మం నుంచి వేరుగా లేరని మరియు ఏకమై ఉన్నారని గ్రహిస్తారో, వెంటనే మీరు అపరిమిత సమృద్ధిని పొందుతారు. అప్పుడు మీకు కావలసిన శక్తి, సంపదలు మరియు వనరులు(భౌతిక వస్తు సంపదలు) ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటాయి, ఎందుకంటే అవి అదే అపరిమిత శక్తి యొక్క వ్యక్తీకరణలే కనుక. అప్పుడు ఏ ప్రయత్నంతో సంబంధం లేకుండా, లేదా ఏ బాహ్య విషయాలపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా, సమృద్ధి యొక్క అనుభవం అనేది మీ ఉనికిలో సహజమైన భాగంగా మారుతుంది. ఒక అక్షయ పాత్రలా, మీ ఆత్మ కూడా ఎల్లప్పుడూ పూర్ణంగాను మరియు సమృద్ధిగాను ఉంటుంది కనుక.

**ఆరోగ్యం:**

**స్వస్థత(వైద్యం) కోసం అపరిమిత శక్తి:** అద్వైతం ప్రకారం, ఆత్మ(నిజమైన నేను) ఎల్లప్పుడూ అనంతమైన ఆరోగ్యం, జీవశక్తి మరియు స్వచ్ఛమైన శక్తి యొక్క మూలమైన బ్రహ్మంతో ఏకమై ఉంటుంది. ఈ దృష్టి కోణంలో గమనిస్తే, శారీరక ఆరోగ్యం అనేది ఈ అనంతమైన మూలంతో మీకు ఉన్న ఆధ్యాత్మిక సమన్వయం(బంధం) యొక్క ప్రతిబింబమే. మీ శారీరక ఆరోగ్యం దీని పైనే ఆధారపడి ఉందన్న మాట. మీరు ఎంత శక్తిని లేదా జీవశక్తిని ఉపయోగించినా, ఏ లోటు ఏ కొరత ఉండదు. ఎందుకంటే మీరు సదా అపరిమితమైన శక్తి భాండాగారానికి కనెక్ట్ అయ్యి ఉన్నారు. అంటే అక్షయపాత్ర లాంటి అపరిమిత స్థితిలో ఉంటారు.

**క్షీణత లేదు:** మీరు అలసిపోయినా, అనారోగ్యంగా ఉన్నా, లేదా శక్తివంతంగా ఉన్నా కూడా అది మీ అసలు వాస్తవం కాదు; ఎందుకంటే మీ ఆత్మ శాశ్వతమైనది మరియు సంపూర్ణమైనది, అది మీ శారీరక స్థాయిలో వచ్చే మార్పులకు ఏ మాత్రం ప్రభావితం కాదు కనుక. అనంతమైన పరమాత్మతో లీనమైనప్పుడు, మీరు వైద్యం మరియు దైవ శక్తి యొక్క అక్షయ పాత్రను(అక్షయపాత్ర స్థితిని) అనుభవిస్తారు. నిజానికి అప్పుడు మీకు శక్తి, ఆరోగ్యం లేదా మరి ఏ విషయంలోనైనా ఎటువంటి లోటు లేదా నష్టం ఉండకపోవడమే కాకుండా, దానికి బదులుగా శరీరం సదా పరమాత్మతో ఏకమై ఉన్న ఏకత్వ స్థితిని ప్రతిబింబిస్తుంది.

**బాంధవ్యాలు:**

**బాంధవ్యాలలో అపరిమితమైన సమృద్ధి:** అన్ని జీవరాశులు ఒకే దైవం యొక్క వ్యక్తీకరణలే అని అద్వైతం బోధిస్తున్నది. కాని మీరు బాంధవ్యాలను, విభజన మరియు అహంకారం (మాయ) యొక్క దృష్టి కోణాల ద్వారా చూస్తూ, రాగ-ద్వేషాల బంధనాలలో చిక్కుకుంటున్నారు, అందు వలనే అసలు సత్యాన్ని గ్రహించలేక పోతున్నారు. అసలు సత్యం ఏమిటంటే, లోతైన స్థాయిలో (ఆత్మ స్థితిలో) గమనిస్తే మనమంతా ఒకరితో ఒకరు సదా అనుసంధానమై ఉన్నాం.

ఇంకా ఈ విషయాన్ని లోతుగా చెప్పాలంటే - సృష్టిలో ఉన్న ఒక అతి చిన్న కణం దగ్గర నుంచి అతి పెద్ద గ్రహాల వరకు చర-అచర(కదిలేవి-కదలనివి) అనే దానితో సంబంధం లేకుండా, అన్నీ మరియు అందరూ కూడా అన్నింటితో కనెక్ట్ అయ్యి ఉన్నాయి. అంటే  సమస్త విశ్వము అంతా (జీవ-జగత్-ఈశ్వరులు అనే విభజన లేకుండా) ఒకటిగా ఒకే శరీరమై ఉందన్న మాట. ఇదే అద్వైత బోధ.

**అపరిమిత-ప్రేమ మరియు అనుసంధానం:** మీరు సంబంధాలలో ప్రేమ లేదా శక్తిని ఎంతగా ఇచ్చినప్పటికీ, అనంతమైన సరఫరా మీకు అంతగా అందించబడుతూనే ఉంటుంది. ఎందుకంటే నిజమైన ప్రేమ - వ్యక్తిగత అహం(జీవాత్మ) నుండి కాకుండా, బ్రహ్మంతో ఏకమైన స్థితి నుంచే అన్ని వైపులా ప్రవహిస్తుంది కనుక. మీరు ఎంత ఎక్కువ ఇస్తే, అంత ఎక్కువగా పొందుతారు; మీరు శక్తిని ఇవ్వడం వల్ల ఇది జరగడం లేదు. ప్రేమ శక్తి అనంతమైనది, అంతటా వ్యాపించి ఉంది కాబట్టి ఇది జరుగుతుంది. ప్రేమ శక్తి, మీ లోపలకి మరియు మీ నుండి అన్ని వైపులా స్వేచ్ఛగా ప్రవహిస్తున్నది.

**డబ్బు మరియు వృత్తి:**

**సమృద్ధి అనేది పరమాత్మ శక్తి యొక్క ప్రతిబింబం:** అద్వైతంలో, డబ్బు అనేది శక్తి యొక్క మరొక రూపం మాత్రమే. ఈ విశ్వంలోని అన్ని విషయాలు అనంత బ్రహ్మం యొక్క వ్యక్తీకరణలే, కనుక డబ్బు మరియు భౌతిక సంపదలు రెండూ సమానంగా సమృద్ధిగా ఉంటాయి. మీరు విశ్వం అందించే సామర్థ్యాలన్నింటినీ ఎప్పటికీ పూర్తిగా ఉపయోగించ లేరు. ఎందుకంటే అవి అనంతమైనవి కనుక, అలాగే అవి అనంతమైన ఏకత్వ స్థితి నుంచి అపరిమితంగా ఉద్భవిస్తున్నాయి, ఇక్కడే అన్ని సామర్థ్యాలు ఒకటిగా ఏకమై ఉన్నాయి. ఈ సమృద్ధి(ఆరోగ్యం, డబ్బు, బంధాలు, వృత్తి) కేవలం పరమాత్మ శక్తి యొక్క ఒక ప్రతిబింబం మాత్రమే, పూర్తి బింబం కాదు; ఇది పరమాత్మ యొక్క అనంత సామర్థ్యాలలో నుంచి వ్యక్తమైన ఒక చిన్న సామర్థ్యం(అంశం) మాత్రమే.

ఉదాహరణకి పరమాత్మని ఒక విశ్వ-వృక్షంగా భావిస్తే - సమృద్ధి అనేది ఆ వృక్షం నుంచి వ్యక్తమైన ఒక చిన్న పండు గాను, అలాగే అక్షయ పాత్రను సమృద్ధి లాంటి అనంతమైన సామర్థ్యాలు గల సమస్త వృక్షం గాను చెప్పవచ్చు.

**అనంతమైన అవకాశాలు:** మీరు ఎంత ఖర్చు చేసినప్పటికీ, డబ్బు మరియు అవకాశాలనేవి మీకు అనంతంగా అందించబడతాయి. ఎలా అయితే అక్షయ పాత్రలో ఆహారం ఎప్పటికీ క్షీణించిపోదో, అలాగే డబ్బు మరియు అవకాశాల యొక్క సామర్థ్యాలు కూడా అపరిమితంగా ఉంటాయి. ఎందుకంటే అవి మూల చైతన్యం నుండి ఉద్భవిస్తున్నాయి కనుక. మీరు మీ వృత్తి లేదా ఆర్థిక లక్ష్యాలను విశ్వ శక్తి(బ్రహ్మం యొక్క అక్షయపాత్ర) ప్రవాహంతో ఏకం చేసినప్పుడు, మీరు అంతులేని అవకాశాలను అందుకునే అయస్కాంతంగా ఉంటారు. మీరు ఏం సృష్టించగలరు లేదా ఏం సాధించగలరు అనే దానికి పరిమితే లేదని తెలుసుకుని, మీరు విజయం కాని విజయాన్ని సాధిస్తారు.

ఎందుకంటే ఇంతకు ముందు వరకు, మీకు ఈ విశ్వ-వృక్షం యొక్క పండుతో మాత్రమే అనుబంధం కలిగి ఉన్నారు, కాని ఇప్పుడు మీరు సమస్త వృక్షంతో(అక్షయపాత్రతో) సంయోగమై ఉన్నారు కనుక. అంటే మీ సహజ స్థితి వైపు అడుగులు వేస్తూ, మీ మూలాన్ని గుర్తించారు.

**కర్మ మరియు అనంతమైన సమృద్ధి:**

అద్వైత పరంగా, కర్మసిద్ధాంతం అనేది ద్వైత-భావనతో లోతుగా ముడిపడి ఉంటుంది. ఈ తత్వశాస్త్రం ప్రకారం - మంచి-చెడు, పుణ్యం-పాపాలలో ఏ కర్మ అయినా - విభజన (మాయ) యొక్క వ్యక్తీకరణే, ఇది పరిమితమైన వ్యక్తిగత గుర్తింపును సృష్టిస్తుంది. ఒక వ్యక్తి ఏదైనా పని చేసినప్పుడు, అతని కదలికలు మూడు కర్మలుగా పేరుకుపోతాయి. అవి

సంచిత-కర్మ (గతంలో పేరుకుపోయిన కర్మ),

ప్రారబ్ధ-కర్మ (ప్రస్తుతం ఈ జీవితంలో కొనసాగుతున్న కర్మ), మరియు

ఆగామి-కర్మ (ఇప్పుడే సృష్టించబడుతున్నది మరియు ఇది భవిష్యత్తులో వ్యక్తమయ్యే కర్మ).

ఈ కర్మ-చక్రం మిమ్మల్ని పరిమితం చేస్తున్నట్టు, లాభం-నష్టం, అదృష్టం-దురదృష్టం, పుణ్యం-పాపం, కష్టపడడం-సుఖపడడం యొక్క భ్రమలతో బంధిస్తున్నట్టు మీకు అనిపిస్తుంది. ఎందుకంటే కర్మ సిద్ధాంతం అనేది సమృద్ధి లేమి వల్ల ఏర్పడినది కనుక. నిజానికి ఈ సమృద్ధి లేమి అనేది ఒక భ్రమ, అజ్ఞానం మాత్రమే, ఈ అజ్ఞానమే కర్మసిద్ధాంతపు ఉనికికి కారణమని అద్వైతం తెలియజేస్తున్నది.

అయితే, అద్వైత వేదాంతం - వాస్తవంగా ఆత్మ కర్మకు బంధీ కాదని, సమృద్ధి-లేమి యొక్క ప్రశ్నే ఉండదని మరియు ఆత్మ ఎల్లప్పుడూ పరమాత్మతో ఏకమై ఉంటుందని బోధిస్తున్నది. పరమాత్మ, మంచి-చెడు ద్వైత భావనలకు అతీతమైనవాడు. ఎవరైతే పరమాత్మతో తమ ఏకత్వాన్ని గుర్తిస్తారో, వారు కర్మను అధిగమిస్తారు. ఎందుకంటే ఏకత్వ స్థితిలో కర్మను అనుభవించడానికి వ్యక్తిగత అహం(నేను పలానా, ఇది నాది, అది నాది అనే తారతమ్య విభజనే) ఉండనే ఉండదు కనుక. అంటే వ్యక్తిగత-అహం అనేది పరిమిత తత్వానికి సంబంధించినది. జీవాత్మ స్థితికే ఈ పరిమితులు, ఆత్మ-పరమాత్మలకు అసలు ఇవేమి ఉండనే ఉండవు కనుక. నిజానికి ఈ ఆలోచనే వ్యర్థం. ఎందుకంటే పరమాత్మ ఒక్కటే అసలు సత్యం; ఈ సమస్త విశ్వమంతా కూడా - రెండవది అనే ప్రశ్నే లేని ఏకైక వాస్తవం, ఇక మిగతా వన్నీ మన భ్రమలు మరియు అజ్ఞాన కల్పితాలే కాబట్టి.

కర్మ సిద్ధాంతం యొక్క ద్వైత భావాలు, భ్రమలు, విభజన అనేవి కేవలం పరిమిత భావాల(పొందడం-పోగొట్టుకోవడం, లాభ-నష్టాలు, గెలుపు-ఓటమిలు, రాగ-ద్వేషాలు, జనన-మరణాలు) యొక్క అజ్ఞానం మీద ఆధారపడి పని చేసే మూఢనమ్మకాలు మరియు అభిప్రాయాలు మాత్రమే. వీటిని

నమ్మినప్పుడే ఇవి మీకు వర్తిస్తాయి, అంటే నమ్మితే ఉన్నాయి, నమ్మకపోతే లేవు - యద్భావం తద్భవతి అన్న మాట.

ఎప్పుడైతే మీరు, నేను జీవాత్మని(పరిమితం) కాదు, నేను ఆత్మను మరియు అనంతమైన బ్రహ్మంతో సదా ఏకమయ్యే ఉన్నానని గుర్తిస్తారో, అప్పుడు మీ పరిమితులు సహజంగానే తొలగిపోతాయి. అంటే మీ జీవాత్మ తలరాతని, అజ్ఞానాన్ని మీకు మీరే తుడిచి వేసినట్టు. ఎప్పుడైతే మీలో ఈ అవగాహన లేదా జ్ఞానజ్యోతి ప్రకాశిస్తుందో, అప్పుడు మీకు మోక్షం(విముక్తి) ప్రాప్తిస్తుంది. ఎందుకంటే ఇదే కర్మ, పాపం-పుణ్యం మరియు పునర్జన్మ చక్రం నుండి విడుదల చేసి స్వేచ్ఛను అందిస్తుంది కనుక. అనంతమైన మరియు అచలమైన బ్రహ్మంతో(అక్షయపాత్ర) విలీనమవ్వడం ద్వారా - మీరు ప్రారబ్ధ-ఆగామి-సంచిత కర్మలన్నీ, మీ జ్ఞానాగ్నిలో అప్రయత్నంగా మరియు సులభంగా ఒక గడ్డిపూచ తగల బడినట్టుగా తగలబడి పోతాయి(జ్ఞానాగ్ని దగ్ధ కర్మాణం).

**కర్మను అధిగమించడానికి అక్షయ పాత్ర ఒక సాధనం:**

అక్షయ పాత్ర అనేది, ఎంత తీసుకున్నా తరగని అనంతమైన మరియు అపరిమిత స్థితికి ఉదాహరణ. అదే విధంగా ముక్తి, మీకు అపరిమిత శక్తి మరియు సమృద్ధి యొక్క స్థితిని అందిస్తుంది, ఇది కర్మలకు అతీతమైన స్థితి. మీరు అహాన్ని లేదా పరిమితత్వాన్ని అధిగమించినప్పుడు, మీరు మంచి మరియు చెడు కర్మల ఫలితాలకు ఏమాత్రం ప్రభావితం కారు. పరబ్రహ్మంతో మీ ఏకత్వాన్ని గ్రహించడంలోని అర్థమేమంటే, మీరు ఎన్ని పనులు చేసినా ఏమాత్రం అలసిపోరు; అలాగే సమృద్ధిని ఎంత వినియోగించినా, మీలో ఏ తేడా ఉండదు; మరియు మీ కర్మలు మంచివా చెడ్డవా అనే దానితో సంబంధం లేకుండా, మీరు ఎప్పుడు ఒకేలా ఉంటారు; మీ ప్రతీ కదలికా ఆ పరబ్రహ్మం యొక్క వ్యక్తీకరణగా ఉంటుంది. ఎందుకంటే ఇప్పుడు మీరు - సమస్త శక్తులు మరియు సంపదలకు మూలమైన అనంతమైన మరియు శాశ్వతమైన అక్షయపాత్ర స్థితిగా(బ్రహ్మంగా) ఉన్నారు కనుక."

## 2. క్వాంటం ఫిజిక్స్: అనంత శక్తి మరియు సంరక్షణ

"క్వాంటం" అంటే విశ్వంలోని ప్రతి కణంలో ఉండే అత్యంత సూక్ష్మ స్థాయిలోని స్థితి మరియు శక్తి యొక్క అతి చిన్న భాగం. **క్వాంటం ఫిజిక్స్** అంటే ఈ సూక్ష్మమైన స్థితిని అధ్యయనం చేసే శాస్త్రం.

క్వాంటం ఫిజిక్స్ - సూక్ష్మ స్థాయిలో చిన్న కణాల ప్రవర్తనను మరియు శక్తి యొక్క మౌలిక స్వభావాన్ని తెలియజేస్తుంది. మన కంటికి అందని విశ్వం యొక్క ప్రాథమిక రహస్యాలను అర్థం చేసుకోవడానికి ఇది ఒక పునాదిని అందిస్తుంది.

ఎందుకంటే మన చుట్టూ ఉన్న ప్రపంచం లేదా విశ్వం చాలా చిన్న కణాలతో తయారై ఉంది. మనం సాధారణంగా మన కండ్లతో పెద్ద వస్తువులు మాత్రమే చూస్తాం, ఇవి ఎప్పుడూ ఒకే విధంగా ప్రవర్తిస్తాయి. కాని చిన్న కణాలు చాలా విచిత్రంగా ప్రవర్తిస్తాయి. (ఇవి ఒకేసారి రెండు చోట్ల ఉండగలవు, తరంగంలాగా, కణంలాగా రెండు రకాలుగా ప్రవర్తించగలవు.) ఈ విచిత్రమైన ప్రవర్తనను అర్థం చేసుకోవడానికి క్వాంటం ఫిజిక్స్ ఉపయోగపడుతుంది.

ఇప్పుడు మనం, క్వాంటం ఫిజిక్స్‌లోని **క్వాంటం క్షేత్రాలు** (quantum fields) మరియు **శక్తి సంరక్షణ** (energy conservation) వంటి కాన్సెప్ట్స్ ద్వారా విశ్వంలోని అనంత శక్తి మరియు సమృద్ధి యొక్క భావనలను గురించి తెలుసుకుందాం.

**క్వాంటం క్షేత్రాలు మరియు అనంత శక్తి:**

క్వాంటం క్షేత్రాలు అంటే ఏమిటి? ఈ క్వాంటం క్షేత్రాలలో ఏమి ఉంటుంది?

- విశ్వంలో ప్రతి కణానికి ఒక క్వాంటం క్షేత్రం ఉంటుంది. ఈ క్షేత్రాలు ఆకాశమంతా (మన చుట్టూ ఉన్న ఖాళీ ప్రదేశంలో) వ్యాపించి ఉంటాయి.(ఉదాహరణకి airtel, Vodafone, idea networks లా ఆకాశమంతా వ్యాపించి ఉంటాయి.) క్వాంటం క్షేత్రాలు అనేవి కనిపించని క్షేత్రాలు.
- క్వాంటం క్షేత్రాలలో (Quantum Fields) ప్రాథమికంగా శక్తి (Energy) ఉంటుంది. ఈ శక్తి వివిధ రూపాల్లో ఉంటుంది. ఈ క్షేత్రాలు కదలడం వల్ల మనం చూసే కణాలు ఏర్పడతాయి.

క్వాంటం క్షేత్ర సిద్ధాంతం ప్రకారం, ఆకాశమంతా వ్యాపించి ఉన్న క్వాంటం క్షేత్రాల నుండే విశ్వంలోని మొత్తం పదార్థం మరియు శక్తి ఉద్భవిస్తున్నాయి. ఈ క్షేత్రాలు ఆకాశమంతా వ్యాపించి ఉండి, నిరంతరం హెచ్చుతగ్గులకు గురవుతూ, విశ్వాన్ని తయారుచేసే కణాలు మరియు శక్తులను ఉత్పత్తి చేస్తున్నాయి. ఈ క్షేత్రాలలో శక్తి పరిమితం కాదు, అపరిమితం.

క్వాంటం క్షేత్రం నుండి మీరు ఎంత శక్తిని 'ఉపయోగించినా', మొత్తం శక్తి స్థిరంగా ఉంటుంది మరియు మీకు అందుబాటులో ఉంటుంది. ఇక్కడ 'అందుబాటులో ఉంటుంది' అంటే శక్తి యొక్క మొత్తం పరిమాణం స్థిరంగా ఉంటుంది, అంటే ఏ మార్పు ఉండదు. అక్షయ పాత్ర వలె, క్వాంటం క్షేత్రాలలోని శక్తి కూడా అక్షయమని ఈ సిద్ధాంతం తెలియజేస్తోంది.

**శక్తి సంరక్షణ:**

క్వాంటం ఫిజిక్స్‌లోని ఒకానొక ప్రాథమిక సూత్రం - శక్తి సంరక్షణ. ఈ సూత్రం మనకు శక్తి యొక్క స్వభావం మరియు క్వాంటం స్థాయి నుండి విశ్వం మొత్తం(సూక్ష్మం నుండి స్థూలం) వరకు శక్తి ఎలా పని చేస్తుందో అర్థం చేసుకోవడానికి సహాయపడుతుంది. నిజానికి ఈ సమస్త విశ్వంలోని అన్ని మార్పులకు కారణం - శక్తి. (ఇక్కడ సైన్స్ పరంగా పరమాత్మని శక్తిగా పరిగణిస్తున్నారు, అదే ఆధ్యాత్మిక పరంగా మనం పరమాత్మని శక్తి మరియు చైతన్యం యొక్క కలయికగా భావిస్తున్నాము.)

శక్తి సంరక్షణ సూత్రం ప్రకారం, శక్తిని మనం సృష్టించలేము లేదా నాశనం చేయలేము, కేవలం శక్తి ఒక రూపం నుండి మరొక రూపానికి మార్పు చెందుతుంది.

దీని అంతరార్థం - ఈ విశ్వంలోని శక్తి యొక్క ఉనికి(బ్రహ్మం) ఎల్లప్పుడూ శాశ్వతం మరియు స్థిరం(అక్షయం). అంటే శక్తికి పుట్టుక-చావులు లేవు, అది వివిధ రూపాల్లోకి మార్పు చెందుతున్నప్పటికీ కూడా, విశ్వంలో ఉన్న మొత్తం శక్తి ఎప్పుడూ ఒకేలా ఉంటుంది. విశ్వం యొక్క శక్తి అక్షయం. శక్తిని ఎంత ఉపయోగించినా కూడా లోటు, కొరత అనే ప్రశ్నే తలెత్తదు అని, క్వాంటం క్షేత్రంలో కణాలూ మరియు శక్తులు(శక్తి యొక్క రూపాలు) మారుతున్నప్పటికీ, మొత్తం శక్తి మాత్రం ఒకేలా ఉంటుందని స్పష్టంగా ఈ సూత్రం బోధిస్తున్నది.

దీనినే మన గురువులు లేదా భగవద్గీత – ఆత్మకి చావు పుట్టుకలు లేవని, అది కేవలం శరీరాలు మారుతుందని, ఆత్మ శాశ్వతమైనది అని చెప్పడానికి కారణం ఇదే. అలాగే ఆత్మని చైతన్యం మరియు శక్తి యొక్క కలయికగాను, శరీరాలు మరియు పదార్థాలను ఆత్మ యొక్క ప్రతిబింబాలు భావించారు.

ఉదాహరణకి శక్తి పరంగా చూస్తే, మీరు డబ్బు లేదా శక్తిని ఖర్చు చేసినప్పుడు, అది మరొక రూపంలోకి మారుతుందే గాని నశించిపోదు కదా, అలాగే ఇది కూడా. అంటే డబ్బు మీ చేతుల నుండి మరొకరి చేతుల్లోకి వెళ్ళిందే గానీ, ఎప్పటికీ ఈ ప్రపంచంలో ఇంకా ఉంటుంది మరియు అలాగే అది ఆర్థిక వ్యవస్థలో తిరిగి ఉపయోగించబడుతూ ఉంటుంది కూడా. అదేవిధంగా, మీరు ఆధ్యాత్మిక శక్తిని ఎంత ఉపయోగించినా కూడా, అది అదృశ్యం కాదు; అది కేవలం రూపాంతరం చెందుతుంది లేదా వేరే అనుభవాలుగా లేదా శక్తి రూపాలుగా మార్చబడుతుంది. కాబట్టి అక్షయపాత్ర మాదిరిగానే, క్వాంటం క్షేత్రంలో శక్తికి క్షీణత లేదు - శక్తి మరియు వనరులు సంరక్షించబడతాయి మరియు ఎల్లప్పుడూ అందరికి అందుబాటులో ఉంటాయి.

**క్వాంటం అన్యోన్యత (quantum Entanglement) మరియు సమృద్ధి:** క్వాంటం మెకానిక్స్‌లో, అన్యోన్యత అనేది రెండు కణాలు ఒకదానితో ఒకటి ఎంతగా అనుబంధాన్ని కలిగి ఉంటాయనే విషయాన్ని తెలియజేస్తున్నాయి, అంటే ఆ రెండు కణాల మధ్య దూరం ఎంత ఉన్నా కూడా - ఒక కణం యొక్క స్థితి, మరొక కణం యొక్క స్థితితో ప్రత్యక్షంగా అనుసంధాన మైనట్టుగానే ఉంటాయి. ఈ పరస్పర అన్యోన్యత లేదా అనుసంధానం విశ్వం యొక్క ఏకత్వ స్వభావాన్ని ప్రతిబింబిస్తున్నది. నిరంతరం ప్రతీది ఒకదానితో ఒకటి పరస్పరం ముడిపడి మరియు కలపబడి ఉన్నాయని మీరు అర్థం చేసుకున్నప్పుడు, సమృద్ధి-శక్తి ఎల్లప్పుడూ పంచబడుతోందని మరియు అందుబాటులో ఉంటోందని, అలాగే మీరు దాని నుండి ఎప్పుడూ వేరుగా లేరని, అది కేవలం మీ భ్రమేనని మీరు గ్రహించటం ప్రారంభిస్తారు. క్వాంటం దృక్పథం ప్రకారం, డబ్బైనా, లేక సంపదైనా, శక్తైనా లేక మరేదైనా కూడా అవి అనంతమైనవి. ఎందుకంటే అవి ఏకత్వ స్థితిలో సదా భాగమై ఉన్నాయి కనుక.

క్వాంటం అన్యోన్యత ప్రకారం, సృష్టిలోని ప్రతిదీ అనుసంధానమై ఉంటే, ఇతరుల చర్యలు మరియు జీవితాలు మిమ్మల్ని ప్రభావితం చేస్తాయి కదా అని మీకు అనిపించవచ్చు. ముఖ్యమైన విషయం ఏమిటంటే, మీరు ఒకరితో ఒకరు అనుసంధానమైనప్పటికీ, మీరు నిస్సహాయులు కాదని మరియు ఇతరుల ఎంపికలపై ఆధారపడి ఏమాత్రం ఉండరనే విషయాన్ని బాగా అర్థం చేసుకోవాలి.

ఆధ్యాత్మిక మరియు క్వాంటం దృక్కోణాలలో, విశ్వం అంతా ఒకటే, ఇక్కడ ప్రతిదీ ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉంటుంది. అద్వైత వేదాంత దృష్టి కోణం నుండి గమనిస్తే, ఆత్మ పరమాత్మలో ఏకమై

ఉన్న భాగం; అలాగే పరబ్రహ్మ చైతన్యం ద్వంద్వాలకు మరియు పరిమితులకు అతీతమైనది. ఈ ఏకత్వపు కోణంలో గమనించినప్పుడు, మీ ఉన్నత ఆత్మ నుండి ఉత్పన్నమయ్యే మీ కోరికలు విశ్వ సమృద్ధి నుండి వేరు కావు. అవి విశ్వ ప్రవాహంలో ఎప్పుడూ భాగమే. ఈ విషయం మనకి ఒక గొప్ప భరోసాని ఇస్తుంది.

ఇతరుల ప్రభావం మీ జీవిత అనుభవాలపై ఉన్నప్పటికీ, మీ ఆలోచనలు, చర్యలు మరియు ఆధ్యాత్మిక సాధనల ద్వారా విశ్వ సమృద్ధికి అనుగుణంగా ఉండగల శక్తిని ఇప్పటికీ మీరు కలిగి ఉన్నారు. మీ నిజమైన స్వరూపం(ఆత్మ)తో అనుసంధానమై, అనంత చైతన్యంతో మీ అనుబంధాన్ని స్థిరపరచుకుంటే, మీ పై బాహ్య ప్రభావాలు(మాయ) ఉన్నప్పటికీ, ఏమాత్రం చలించకుండా మీరు మీ లక్ష్యాలు సాకారం అయ్యే విధంగా శక్తి ప్రవాహాన్ని నిర్దేశించగలరు.

క్వాంటం మెకానిక్స్‌లో, కణాలు ఒక దానితో ఒకటి అనుసంధానమై ఉన్నప్పటికీ, అవి వ్యక్తిగత స్థితులను కలిగి ఉంటూ మరియు వాటి స్వంత లక్షణాల ఆధారంగా విభిన్న ఫలితాలను వ్యక్తపరచగలవు. అదేవిధంగా, జీవితంలో మీరు ఇతరులతో కలిసి ఉన్నప్పటికీ, మీ ఆత్మతో మీ అనుబంధం అనేది మీ స్వంత మార్గంలో వృద్ధి చెందేలా మిమ్మల్ని ప్రోత్సహిస్తుంది. ఇది విశ్వంతో సమన్వయంగా ఉంటూనే, మీ కోరికలను మరియు లక్ష్యాలను నెరవేర్చుకోగలమని స్పష్టంగా తెలియజేస్తోంది. దీని కోసం మీరు చేయాల్సినది ఏమంటే, ఆ అనుసంధానాన్ని సరైన అవగాహన మరియు ఉద్దేశ్యంతో నిర్దేశించడమే. మీ ఆలోచనలు, నమ్మకాలు, చర్యలే మీ లక్ష్యాల వ్యక్తీకరణకు ముఖ్యమైనవి అని తెలుసుకోండి.

ఇక్కడ మీరు అర్థం చేసుకోవాల్సింది - మీ ఉన్నత ఆత్మతో మరియు అనంతమైన శక్తి మూలంతో విలీనమై ఉన్నంత వరకు మీరు ఏ లక్ష్యాలైనా సాధించవచ్చు. బాహ్య ప్రభావాలు మీ మార్గాన్ని రూపొందిస్తున్నట్టు మీకు కనిపించినా కూడా,  మీకు విశ్వంతో(పరమాత్మ) మరియు దాని సమృద్ధితో ఉన్న మీ అంతర్గత సంబంధమే మీరు కోరుకున్నది సాధించడానికి కావలసిన శక్తిని, సామర్థ్యాన్ని అందిస్తున్నది. ఎందుకంటే ఏ బాహ్య విషయానికైనా శక్తిని ఇచ్చేది ఈ సంబంధమే కాబట్టి.

**తరంగం-కణం(wave-particle duality) ద్వంద్వ స్వభావం:** మన కంటికి కనిపించే స్థాయిలో కణాలు ఎప్పుడూ ఒకే ప్రవర్తనని(కణ స్వభావాన్ని) కలిగి ఉంటాయి, కాని క్వాంటం స్థాయిలో, కణాలు ద్వంద్వ-స్వభావాన్ని ప్రదర్శిస్తూ, అనంతమైన సామర్థ్యాన్ని కనబరుస్తున్నాయి. ఇక్కడ ద్వంద్వ-స్వభావం అంటే కణం ఒకేసారి తరంగం మరియు కణం రెండింటిగా ప్రవర్తించడం.

క్వాంటం స్థాయిలో ఎలక్ట్రాన్లు వంటి కణాలు - కణం మరియు తరంగం రెండింటిగా ప్రవర్తిస్తూ, ఇక్కడ అనంతమైన శక్తి అందుబాటులో ఉందని నిరూపిస్తున్నాయి. మన చుట్టూ కనిపిస్తున్న వస్తువులన్నీ కూడా ఇలా కనుక్కోబడినవే. (అన్ని ఎలక్ట్రానిక్ పరికరాలు - మొబైల్స్, ఇంటర్నెట్, టీ.వీ లు, లాప్‌టాప్స్, ఏ.సి లు మొదలైనవన్నీ.)

ఈ ద్వంద్వ స్వభావాన్ని ఆధ్యాత్మిక పరంగా గమనిస్తే, కణం అంటే పరిమిత-తత్వం(జీవాత్మ) మరియు తరంగం అంటే అపరిమిత-తత్వంగా(ఆత్మ) చెప్పవచ్చు. మనం చూసినప్పుడు ఒక కణం కణ-రూపంగా, చూడనప్పుడు తరంగంగా(నిరాకారం) ఉంటోంది. అంటే చూసేవాడి దృష్టి కోణం బట్టి, ఇది మారిపోతోందన్న మాట. మనం బాహ్యస్థాయిలో స్థూలంగా(శరీరంగా) అనిపించినప్పటికీ, ఎల్లప్పుడూ అంతర్-స్థాయిలో నిరాకారం(ఆత్మ)గా ఉంటున్నామని, అంటే అంతటా వ్యాపించిన నిరాకరంతో(పరమాత్మతో) సదా ఏకమై ఉన్నామని తెలియజేస్తోంది.

అలాగే చూసేవాడు(subject) ఎప్పుడూ నిరాకార ఆత్మే(99%)నని, శరీరం(1%) కాదని, ఇది కేవలం మన తాత్కాలిక రూపమేనని, ఈ కారణంగానే మనం ఒకేసారి ఆకారం-నిరాకారంగా, దృశ్య-అదృశ్యాలు రెండింటి సామర్థ్యాలని కలిగి ఉన్నామని - ఈ సూత్రం ద్వారా మనం స్పష్టంగా అర్థం చేసుకోవచ్చు. మనం కేవలం శరీరం కాదు, ఆత్మ అని భగవద్గీత మరియు అద్వైతం చెప్పడానికి కారణం ఇదే. నిజానికి ఇది మనలో ఉన్న ఎన్నో భ్రమలని, అజ్ఞానాన్ని కూకటివ్రేళ్ళతో సహా ప్రెకలించేస్తోంది మరియు పరమాత్మ స్వరూపంతో మనకున్న అనుబంధాన్ని సాక్ష్యాధారాలతో నిరూపిస్తోంది. కాబట్టి ఈ విశ్వం అంతా కూడా పరమాత్మ యొక్క వ్యక్తీకరణే, ఉన్నది అంతా కూడా కేవలం బ్రహ్మమే.

క్వాంటం స్థాయిలో, విశ్వం ఒక అక్షయపాత్రలా - లెక్కలేనన్ని రూపాలను అంటే శక్తి, పదార్థం మరియు సమృద్ధి రూపాలను వ్యక్తం చేయగల అనంతమైన సామర్థ్యాన్ని కలిగి ఉంది. ఇది మీకు అనంతమైన సమృద్ధిని ఎప్పుడూ మీకు అందించడానికి సిద్ధంగానే ఉంది. కాబట్టి విశ్వం యొక్క అక్షయపాత్ర

సామర్థ్యాన్ని, ఏ షరతులు ఏ సందేహాలు లేకుండా నిస్సందేహంగా ఉపయోగించుకోవచ్చు. కేవలం మీరు చెయ్యవలసినదల్లా ఒక్కటే - పరమాత్మతో మీ ఏకత్వాన్ని గ్రహించడమే, అప్పుడు మీరు ఏ రూపాన్నైనా, ఏ శక్తినైనా, ఏ పదార్థానైనా, ఎంతటి సంపదనైనా, ఏ లక్ష్యానైనా కూడా క్వాంటం క్షేత్రం నుండి క్షణంలో ప్రత్యక్షం చేసుకోవచ్చు.

**ఆరోగ్యం:**

**శక్తి క్షేత్రాలు మరియు ఆరోగ్యం:** క్వాంటం భౌతికశాస్త్రం, మన శరీరాలతో సహా ప్రతీది క్వాంటం క్షేత్రాలతోనే తయారైందని ప్రతిపాదిస్తుంది. ఈ క్షేత్రాలు అనంతమైనవి మరియు నిరంతరం కదులుతూ స్పందిస్తూ ఉంటాయి. మీరు శారీరక ఆరోగ్యం కోసం ఎంత శక్తిని ఉపయోగించినా, క్వాంటం క్షేత్రంలో ఎల్లప్పుడూ అనంతమైన నిల్వ ఉంటుంది.

**స్వీయ-వైద్యం:** క్వాంటం క్షేత్రాలలో శక్తిని నాశనం చేయలేనట్టుగానే, మీ శరీరానికి గల వైద్యశక్తి(స్వస్థత) మరియు జీవశక్తి యొక్క సామర్థ్యం కూడా అనంతమైనది. ఆరోగ్యానికి అసలు రహస్యం - మీరు విశ్వశక్తి వ్యవస్థలో భాగమని గుర్తించడమే, అంటే సమతుల్యతని పునరుద్ధరించబడడం ద్వారా మరియు క్వాంటం శక్తి యొక్క అనంతమైన క్షేత్రానికి కనెక్ట్ కావడం ద్వారా స్వస్థతను పొందగలమని సూచిస్తోంది. ఒక్కమాటలో చెప్పాలంటే ఆరోగ్యం అనేది కేవలం శారీరకమైనది కాదని, అది ఒక పెద్ద శక్తి వ్యవస్థలో భాగమని తెలియజేస్తున్నదన్న మాట.

**బాంధవ్యాలు:**

**అన్యోన్యత మరియు అనుసంధానం:** క్వాంటం భౌతికశాస్త్రంలో, అనుబంధం అనేది విశ్వంలోని ప్రతిదీ ఒకదానితో ఒకటి అనుసంధానించబడి ఉందని తెలియజేస్తున్నది. ఈ పరస్పర అన్యోన్యతని మనల్ని ఇతరులతో కలిపి ఉంచే అదృశ్య దారాలుగా కూడా అర్థం చేసుకోవచ్చు. క్వాంటం కణాలు ఒకదానితో ఒకటి తక్షణమే ప్రభావితం చేయగలిగినట్లే, మన ఆలోచనలు, పనులు మరియు ప్రేమ అనేవి కాలం మరియు దేశం హద్దులను దాటి ఇతరులను ప్రభావితం చేయగలవు. ఉదాహరణకి భారతదేశంలో ఉన్న మనం, అమెరికాలో ఉన్న వాళ్లని ప్రభావితం చేయవచ్చు, అలాగే గతం, భవిష్యత్,

వర్తమానాలకు సంబంధం లేకుండా కూడా ప్రభావితం చేయవచ్చు, ఎందుకంటే ఇది భౌతికపరమైన చర్య కాదు, అందరి యొక్క అంతర్గత(నిరాకార) స్థితికి సంబంధించిన చర్య కనుక.

ఎందుకంటే ఈ విశ్వంలోని అన్నీ - అందరితో మరియు అన్నింటితో అదృశ్యంగా కనెక్ట్ అయ్యే ఉన్నాయి, కేవలం మనుషులే కాకుండా, సమస్త జీవరాశులు మరియు నిర్జీవ వస్తువులు, సమస్త గ్రహాలు, నక్షత్రాలు మరియు పాలపుంతలు అన్నీ కూడా ఒక దానితో ఒకటి పరస్పరం ముడిపడి ఉన్నాయి కనుక. మనం దీనిని విశ్వ-కుటుంబంగా(పరమాత్మ) పిలువవచ్చు (ఇది వసుదైక కుటుంబం కన్నా ఉన్నతమైన భావనగా చెప్పవచ్చు, వసుదైక అంటే కేవలం భూమికి సంబంధించిన సంతతి మాత్రమే). అందుకని ఈ విశ్వ-కుటుంబంలోని ఎవరైనా - ఎవరినైనా మరియు దేనినైనా ప్రదేశం(కేవలం మనకి తెలిసిన ప్రదేశాలే కాకుండా), కాలం(గతం-వర్తమానం-భవిష్యత్)తో సంబంధం లేకుండా - ఆలోచనలు, పనులు మరియు ప్రేమ ద్వారా అదృశ్యంగా ప్రభావితం చేయగలరు.

**అంతులేని అనుసంధానం**: సంబంధాలలో, ప్రేమ మరియు అనుబంధం అనేవి పరిమితమైనవి కావు. మీరు ఎంత ఎక్కువ శక్తిని ఇస్తే, అంత ఎక్కువగా పొందుతారు; ఎందుకంటే అన్నీ క్వాంటం స్థాయిలో ఒకదానితో ఒకటి అనుసంధానించబడి ఉన్నాయి, అలాగే క్వాంటం శక్తి క్షేత్రాల నుండి నిరంతరం శక్తిని గ్రహిస్తూనే ఉంటాయి కాబట్టి. నిజానికి మీరు బాంధవ్యాలలో శక్తిని కోల్పోవడం అనేది జరగదు. ప్రేమ మరియు అనుబంధం యొక్క శక్తి(క్వాంటం క్షేత్రాల నుండి) ఎల్లప్పుడూ మనకు అందుబాటులో ఉంటుంది. అది ఎల్లప్పుడూ ఎదుగుదలకి, ఒకరికొకరు తోడుగా ఉండడానికి అనంతమైన అవకాశాలను అందిస్తుంది.

నిజానికి మనతో మనకున్న శాశ్వత బంధానికి కనెక్ట్ అయిన వెంటనే, మనకి అనంత సమృద్ధి యొక్క అక్షయపాత్ర స్థితి అందుబాటులో ఉంటుంది. క్వాంటం పరంగా, దీని యొక్క అంతరార్థం ఏమంటే - మనం ఎల్లప్పుడూ ఈ విశ్వం యొక్క క్వాంటం క్షేత్రాలతో కనెక్ట్ అయ్యే ఉన్నామని మరియు నిజానికి ఇక్కడ నుంచే విశ్వంలోని ప్రతి పదార్థం మరియు శక్తి అంతా ఉద్భవించేదని మరియు ఇదే అన్నింటికి మూలాధారమైనదని. అంటే మనం ఏ బాహ్య విషయం, వస్తువు, మనిషి... దేనిపైనా మనం ఆధారపడిలేమని, మన లోటు ఏది తీర్చడం లేదని, కేవలం మనకి అన్నీ అందిస్తున్నది మరియు మన ఉనికికి అన్ని విధాలా కారణమైనది ఇదే(క్వాంటం క్షేత్రం లేక పరమాత్మే) నని అర్థం.

ఉదాహరణకి బయట ఒక మనిషి మనకి ప్రేమని అందిస్తున్నట్టు మరియు మన లోటు తీరుస్తున్నట్టుగాను, అలాగే ప్రతీ పదార్థం ఇంకొక దాని నుంచి వచ్చినట్టు, అంటే గేదె నుంచి పాలు, చెట్టు నుంచి పండ్లు, మనిషి నుంచి పిల్లలు పుడుతున్నట్టుగాను, ఆకలి ఆహారం మీద ఆధారపడినట్టుగాను, ఇలా మనకి ఈ సృష్టిలో కనిపించేదంతా కేవలం భ్రమ మాత్రమేనని, నిజానికి ఏది కూడా దేని మీద ఆధారపడడం లేదని, కేవలం క్వాంటం క్షేత్రాలే(నిరాకారమే) అన్నింటికి మూలమని గ్రహించాలి. తల్లి, తండ్రి, గురు, దైవము అంతయు నీవే అని అనడానికి కారణం ఇదే. ఆ ఒక్కటే ఇన్నింటిగా ఉన్నది. ఈ సత్యాన్ని గ్రహించడం ద్వారా, క్వాంటం క్షేత్రాల యొక్క అక్షయపాత్రతో(మీ స్వస్వరూపం) శాశ్వతమైన మరియు అంతులేని అనుసంధానాన్ని గుర్తిస్తారు.

**డబ్బు మరియు వృత్తి:**

**అనంతమైన అవకాశాలు గల క్వాంటం క్షేత్రం:** క్వాంటం భౌతిక శాస్త్రంలో, క్వాంటం క్షేత్రం అన్ని అవకాశాలను కలిగి ఉంటుంది. ఈ క్షేత్రంలోకి ప్రవేశించగానే, మీ వృత్తి మరియు ఆర్థికపరమైన విజయాలను మీరు పొందడాన్ని గమనించగలరు. పైన మనం చెప్పుకున్న అక్షయ పాత్ర ఉదాహరణ ఇక్కడ సరిగ్గా వర్తిస్తుంది, ఎందుకంటే క్వాంటం క్షేత్రం, అనంతమైన పాత్ర వలె, అపరిమిత సామర్థ్యాన్ని కలిగి ఉంటుంది. మీరు ఎంత డబ్బు ఖర్చు చేసినా లేదా పెట్టుబడి పెట్టినా, మీరు నిరంతరం అందుబాటులో ఉండే అపరిమిత వనరుల మూలాన్ని మీరు ఉపయోగించుకుంటారు.

**శక్తి సంరక్షణ మరియు ఉద్యోగాభివృద్ధి:**

క్వాంటం వ్యవస్థలలో శక్తి ఎప్పుడూ ఒక రూపం నుండి మరొక రూపానికి మారుతుంది, కానీ ఎప్పటికీ నశించదు. అదేవిధంగా, మీ కెరీర్‌లో మీరు పెట్టే శ్రమ, ప్రయత్నాలు రూపాంతరం చెందుతాయి. అవి కొత్త అవకాశాలుగా, విజయాలుగా పరివర్తనం చెందుతాయి. మీరు మీ పనిలో ఎంత శక్తిని పెడితే, అంత విజయం మీకు లభిస్తుంది. క్వాంటం క్షేత్రం ఎల్లప్పుడూ గతిశీల స్థితిలో ఉంటుంది, సంపద మరియు విజయాన్ని సాధించడానికి మీకు అంతులేని అవకాశాలను అందిస్తుంది, అక్షయ పాత్రలా. మీరు మీ మూలంతో కనెక్ట్ కావడం ద్వారా, దేనినైనా క్వాంటం క్షేత్రం నుంచి అప్రయత్నంగానే మరియు సులభంగానే ప్రత్యక్షం చేసుకోగలరు.

**కర్మను అధిగమించడం:**

కర్మను అధిగమించడం: క్వాంటం ప్రపంచంలో, క్వాంటం క్షేత్రంలోని శక్తి సృష్టించబడదు లేదా నాశనం చేయబడదు; అది కేవలం రూపాంతరం చెందుతుంది. అదేవిధంగా, మీరు పరమాత్మ చైతన్యంలో భాగమని గ్రహిస్తే, కర్మ బంధాల నుండి విముక్తి, స్వేచ్ఛ పొందుతారు. ఎందుకంటే ఎవరి కర్మలకైనా కారణం పరమాత్మేనని, ఇక్కడ కనిపిస్తున్నవి ఆయన ద్వారా నడిపించబడుతున్న కీలుబొమ్మలమేనని గ్రహిస్తే కర్మ ఎక్కడ ఉంటుంది, ఉండదు కదా! అప్పుడు అది కేవలం పరమాత్మ యొక్క చైతన్యంగా సాక్షాత్కరిస్తుంది. ఎందుకంటే అనంతమైన మూలం లేదా విశ్వం యొక్క అక్షయ పాత్ర అనేది అహంకారం యొక్క చర్యల చేత ప్రభావితయ్యేది కాదు కనుక.

ఈ ఆధ్యాత్మిక విముక్తి అనేది క్వాంటం ఎంటాంగిల్‌మెంట్ లాంటిది. క్వాంటం ఎంటాంగిల్డ్ స్థితిలో అనుసంధానమై ఉన్న కణాలు ఎంత దూరంలో ఉన్నా లోతైన అనుబంధాన్ని కలిగి ఉంటాయి. అదేవిధంగా, మీరు పరబ్రహ్మంలో లీనమైనప్పుడు, మీరు అనంత అనుసంధాన చైతన్యంలోకి ప్రవేశిస్తారు. ఈ స్థితి గతం, వర్తమానం లేదా భవిష్యత్ చర్యల (కర్మ) పరిమితులకు అతీతం. అప్పుడు లాభనష్టాల అనుభవం అనేది ద్వైతభావనేనని తేలిపోతుంది. క్వాంటం క్షేత్రం నుండి మీరు శక్తిని కోల్పోలేనట్లే, మీరు పరబ్రహ్మంలో లీనమైనప్పుడు - శక్తి, ఆరోగ్యం, ప్రేమ, సంపద లేదా అవకాశాలను కోల్పోలేరు.

**3. రెండు దృక్పథాల సారాంశం:**

అద్వైత వేదాంతం మరియు క్వాంటం భౌతికశాస్త్రం రెండూ - సమృద్ధి, శక్తి మరియు సంపదల గురించి ఏకీకృతమైన మరియు అనంతమైన దృక్పథాన్ని అందిస్తున్నాయి. జీవితంలోని వివిధ రంగాలలో మీరు ఈ భావనను ఆచరణాత్మకంగా ఎలా అన్వయించవచ్చో ఇప్పుడు చెబుతాను:

**ఆరోగ్యం:** ఆరోగ్యం లేదా శక్తిని నిజంగా కోల్పోవడం జరగదు, ఎందుకంటే శక్తి యొక్క మూలస్థానం అనంతమైనది మరియు నిశ్చలమైనది. ఈ సత్యాన్ని అర్థం చేసుకోవడం అంటే, మీరు ఆరోగ్యంలో సమస్యలను ఎదుర్కొన్నప్పటికీ, మీరు ఎప్పటికీ పూర్తిగా బలహీనపడలేరని(అసంభవమని) మరియు ఈ అనంతమైన మూలానికి అనుసంధానం అవ్వడం ద్వారా స్వస్థత ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని గ్రహిస్తారు. అంటే, ఆరోగ్యం బాగోకపోయినా మీరు పూర్తిగా శక్తిని కోల్పోలేదని, ఆ అనంతమైన శక్తితో కనెక్ట్ అయితే మళ్ళీ స్వస్థత చెందుతారని గ్రహిస్తారు."

**బాంధవ్యాలు:**

మీరు స్నేహంలో కానీ, కుటుంబంలో కానీ, ప్రేమ బంధంలో కానీ - ఎంత ప్రేమ, శక్తిని ఇతరులకు పంచినా, అది మిమ్మల్ని బలహీనపరచదు. పైగా, అది ఒక శక్తి ప్రవాహాన్ని సృష్టిస్తుంది, అది అందరినీ కలుపుతుంది. బంధాలు అనేవి లాభనష్టాల వ్యాపారం కాదు కదా. మీరు ఎంత ఎక్కువ ప్రేమ, నమ్మకం, శక్తిని అందిస్తే అంతకంటే ఎక్కువే మనకు తిరిగి వస్తుంది. ఎందుకంటే ప్రేమ అనేది అంతులేనిది, అది ఎప్పుడూ ఉంటుంది, నిజానికి ఆ శక్తి మీకు అనంతమైన శక్తి మూలం నుంచి అందుతోంది కనుక.

**డబ్బు మరియు వృత్తి:** డబ్బు మరియు వృత్తి అవకాశాలు అనేవి క్వాంటం క్షేత్రం లేదా బ్రహ్మం వలె, సమృద్ధిగా ప్రవహిస్తాయి. మీరు ఎంత ఎక్కువ ఖర్చు చేసినా లేదా పెట్టుబడి పెట్టినా, మీకు అంతకంటే ఎక్కువ వస్తుంది, ఎందుకంటే విశ్వం యొక్క సమృద్ధి క్షేత్రం అపరిమితమైనది కనుక. అప్పుడు మీ చర్యలు శక్తిని క్షీణింపజేయవు, మిమ్మల్ని మరింత ఎక్కువగా వికసింపజేస్తూ, విస్తరింపజేస్తాయి. అక్షయ పాత్ర ఉదాహరణ యొక్క ఉద్దేశ్యం ఒక్కటే, లోటు అనేది సృష్టిలో లేదని అలాగే సమృద్ధి అనంతమైనది అని తెలియజేయడమే.

**చివరి ఆలోచన:**

అద్వైత వేదాంతం మరియు క్వాంటం భౌతికశాస్త్రం రెండింటి యొక్క ముఖ్యమైన సారాంశం ఏమిటంటే: శక్తి, ప్రేమ, సంపద లేదా అవకాశాలకు ఏ కొరత లేదు. విశ్వం, క్వాంటం క్షేత్రం మరియు మీ ఆత్మ అన్నీ కూడా - శక్తి మరియు సమృద్ధి యొక్క అనంతమైన మూలానికి అనుసంధానించబడి ఉన్నాయి. ఈ అపరిమిత మూలంతో మీరు సదా అనుసంధానమై ఉన్నారనే విషయాన్ని గుర్తించడం ద్వారా, మీరు అపరిమిత ఆరోగ్యం, బాంధవ్యాలు, డబ్బు మరియు వృత్తిలో అభివృద్ధిని అనుభవిస్తారు. ఈ మూలం ఒక అక్షయపాత్ర వలె, మీరు ఎంత శక్తి మరియు సంపద ఉపయోగించారనే దానితో సంబంధం లేకుండా మీకు కావలసిన దానిని ఎల్లప్పుడూ అందిస్తుంది - ఎందుకంటే నిజానికి నష్టమనేది లేదు కనుక.

అద్వైత వేదాంతం, క్వాంటం ఫిజిక్స్‌ని కలిపి చూస్తే, అక్షయ పాత్రలాగే, మనం ఎప్పుడూ అనంతమైన శక్తి, సమృద్ధి, ప్రేమ, అవకాశాలకు శృతియై ఉంటామని తెలుస్తుంది. ఆధ్యాత్మిక సాక్షాత్కారం ద్వారా - మీరు కర్మ, పాపం మరియు పుణ్యం యొక్క ద్వంద్వాలను, అలాగే సమయం మరియు స్థలం యొక్క

పరిమితులను అధిగమిస్తారు. మీరు సమస్త శక్తులు మరియు సంపదల యొక్క అనంతమైన మరియు శాశ్వతమైన మూలంతో(పరబ్రహ్మం), సదా ఏకమై ఉన్నారని గ్రహిస్తారు.

పరస్పర అనుసంధానం మరియు అనంతమైన సామర్థ్యం యొక్క ఈ అవగాహన, మిమ్మల్ని విశ్వ సమృద్ధి ప్రవాహానికి అనుగుణంగా జీవించడానికి అనుమతిస్తుంది. ఈ స్థితిలో, అసలు లాభ-నష్టాలే ఉండవు; అలాగే ప్రతి కర్మ పరివర్తన మరియు పునరుద్ధరణ యొక్క అంతులేని చక్రంలో (ఏకత్వపు స్థితిలో) భాగమవుతుంది.

ఈ విధంగా, అక్షయ పాత్ర భౌతిక సమృద్ధికి చిహ్నంగానే కాకుండా, ఆధ్యాత్మిక సమృద్ధికి శక్తివంతమైన సాధనంగా(ఉదాహరణగా) కూడా పనిచేస్తుంది. మీ నిజమైన స్వభావాన్ని గుర్తించడం ద్వారా మరియు కర్మ చక్రాన్ని లేదా కర్మసిద్ధాంతాన్ని అధిగమించడం ద్వారా, మీరు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండే అనంతమైన శక్తిని ఉపయోగించుకుని, మీ జీవితంలోని ప్రతి రంగంలో సమృద్ధిని వ్యక్తపరుస్తారు.

## అనుసంధానం లేదా ఏకమవ్వడం

అక్షయ పాత్ర అంటే ఏమిటో తెలుసా? అనంతమైన సమృద్ధికి గుర్తు. దీనితో ఏకమై ఉండడం అనేది ఒక పరివర్తన ప్రక్రియ; మీలో ఆధ్యాత్మిక, మానసిక, శక్తి స్థాయిలలో సమతుల్యతని(సమన్వయాన్ని) ఏర్పరిచే ఒక పరివర్తన ప్రక్రియ. అద్వైత వేదాంతం మరియు క్వాంటం ఫిజిక్స్ రెండింటిలోనూ, సమృద్ధి అనంతమైనది - అది ఆరోగ్యం, సంపద, ప్రేమ లేదా శక్తి అయినా కూడా అనంతమైనది. ఎప్పుడైతే మీరు సృష్టికి మూలమైన పరబ్రహ్మస్థితితో ఏకమవుతారో, అప్పుడు మీకు సమృద్ధి(అక్షయపాత్ర స్థితి) అందుబాటులో ఉంటుంది.

## ఈ అనంతమైన సమృద్ధితో ఎలా ఏకం కావాలో ఇప్పుడు తెలుసుకుందాం:

### 1. అనంత మూలంతో(పరమాత్మతో) మీ ఏకత్వాన్ని గుర్తించండి

అద్వైత వేదాంతంలో, ప్రాథమిక బోధన ఏమిటంటే - మీ ఆత్మ సదా పరమాత్మతో ఏకమై ఉంది, నిజానికి రెండూ ఒకటేనని. మీరు వెతుకుతున్న ప్రతీది - శక్తి, సంపద, ప్రేమ లేదా ఆరోగ్యం ఏదైనా

కూడా - ఈ అనంతమైన, అవిభక్త మూలం నుండే ఉద్భవిస్తున్నాయి. అక్షయపాత్ర(క్వాంటం క్షేత్రం) లేదా అపరిమిత సమృద్ధితో శృతిలో ఉండటానికి, మీరు మొదటగా చేయాల్సింది ఏమంటే – నేను ఎప్పుడూ కూడా అనంత సమృద్ధి మూలం నుండి వేరు కాదని గ్రహించడమే.

**ఆచరణాత్మక సాధనాలు(**Practical Steps**):**

**ధ్యానం**: మనస్సును ప్రశాంతంగా ఉంచడానికి, మీ నిజమైన స్వరూపం యొక్క స్పృహతో విలీన మవ్వడానికి లోతైన ధ్యానం చేయండి. మీ ఆత్మ ఎల్లప్పుడూ అనంతమైన పరబ్రహ్మంతో ఏకమై ఉంటుంది.

**ఆత్మ విచారణ**: మీ ఉనికి యొక్క స్వభావాన్ని ఎప్పుడూ ప్రశ్నిస్తూ ఉండండి. "నేను ఎవరు?" అని మిమ్మల్ని మీరు ప్రశ్నించుకోండి; మీ నిజ స్వభావం - శరీరం మరియు మనస్సుకు అతీతంగా ఉందని మరియు అది అనంత చైతన్యంతో ఏకమై ఉందనే అవగాహన వైపు అన్వేషణ కొనసాగించండి.

**జ్ఞాన సూత్రాలు**: విశ్వంతో మీ ఏకత్వాన్ని మీకు సదా నిరంతరం గుర్తు చేసే జ్ఞానసూత్రాలను గుర్తు చేసుకోండి(మననం చేసుకోండి). ఉదాహరణకు, "నేను విశ్వం యొక్క అనంత సమృద్ధితో ఒకటై ఉన్నాను" లేదా "సమస్త శక్తి యొక్క మూలం నాలోనే ఉంది."

**2. బంధాలు(రాగ-ద్వేషాలు) మరియు పరిమిత నమ్మకాలను వదిలివేయండి**

ఫలితాల పట్ల ఆసక్తిని, మరియు సంపద గురించి పరిమిత నమ్మకాలను కలిగి ఉండడం వలన – మీరు లోటు లేదా క్షీణత యొక్క అనుభవాన్ని పొందుతారు. అద్వైత వేదాంతంలో, బంధం మరియు అహంకారం అనేవి విభజన మరియు పరిమితి-తత్వం యొక్క భ్రమకు కారణమవుతాయి. మీరు బంధాలను అధిగమించిన తర్వాత, మీరు అనంతమైన సమృద్ధికి కనెక్ట్ అవుతారు.

**ఆచరణాత్మక సాధనాలు:**

**కొరత భయాన్ని విడుదల చేయండి:** మీకు తగినంత లేదని చెప్పే ఏవైనా నమ్మకాలు లేదా భయాలను ప్రశ్నించండి. ఎందుకంటే ఈ నమ్మకాలు మిమ్మల్ని కొరత యొక్క భ్రమలో చిక్కుకుపోయేలా చేస్తాయి. ఈ ప్రపంచంలోని అన్ని రూపాలు తాత్కాలికమైనవే, వాటిని నడిపిస్తున్న శక్తి శాశ్వతమైనది

మరియు అదృశ్యమైనదని తెలుసుకుని, కనబడే భౌతిక ప్రపంచపు మాయలో పడిపోకుండా, మీ చుట్టూ ఉన్న పరిస్థితులతో ఎంత ఉండాలో అంతలో ఉంటూ, అంటీ ముట్టనట్టుగా ఉండటాన్ని అభ్యసించండి. అంటే సదా పరమాత్మని గుర్తు చేసుకోవడమే.

**కృతజ్ఞతను పెంపొందించుకోండి:** రోజువారీ కృతజ్ఞతను అభ్యసించడం ద్వారా మీ మనస్సును కొరత నుండి సమృద్ధి వైపు దృష్టి మరల్చండి. మీ జీవితంలో ఇప్పటికే ఉన్న అనంతమైన ఆశీర్వాదాలను గుర్తించండి మరియు వాటికి కృతజ్ఞతను తెలియజేయండి.

**ప్రవాహానికి ఆధీనమవ్వండి:** విశ్వం(పరమాత్మ) మీకు ఏమి కావాలో, ఎప్పుడు కావాలో అది ఖచ్చితంగా అందిస్తుందని నమ్మండి, విశ్వప్రవాహానికి ఆధీనమవ్వండి. ఫలితాలను నియంత్రించాల్సిన అవసరాన్ని లేదా ప్రతీది మీ అదుపులో ఉండాలనే ఆలోచనను, సమృద్ధిని నియంత్రించాలనే కోరికను వదిలివేయండి.

**3. విశ్వ శక్తి ప్రవాహంతో మీ చర్యలను అనుసంధానం చేయండి**

అద్వైత వేదాంతం మరియు క్వాంటం ఫిజిక్స్ రెండూ కూడా - అన్ని విషయాల మధ్య ఉన్న పరస్పర అనుసంధానాన్ని పదేపదే నొక్కి చెబుతున్నాయి. మీ ఆలోచనలు, మాటలు మరియు చర్యలు విశ్వంలోకి వ్యాపిస్తాయి, అలాగే అవి సమృద్ధి ప్రవాహాన్ని ప్రభావితం చేస్తాయి. మీరు మీ చర్యలను విశ్వం యొక్క అనంతమైన శక్తితో శృతి చేసినప్పుడు, మీరు అపరిమిత అవకాశాలను మీ అంతట మీరు విశాల హృదయంతో ఆహ్వానిస్తారు.

**ఆచరణాత్మక సాధనాలు:**

**మనస్ఫూర్తిగా శ్రద్ధతో పని చేయండి:** మీ అన్ని విషయాలతో మీకున్న పరస్పర అనుబంధాన్ని గుర్తుంచుకుని, మీ రోజు వారీ పనులను మనస్ఫూర్తిగా మరియు శ్రద్ధగా ఒక ధ్యానంలా చేయండి. మీరు ఈ విధంగా విశ్వ ప్రవాహంతో సామరస్యంగా వ్యవహరించినప్పుడు, సమృద్ధి సహజంగా మీ జీవితంలోకి ప్రవహిస్తుంది.

**దానం చేయడం మరియు ఇవ్వడం:** అక్షయ పాత్ర నిరంతరం అందిస్తున్నట్లే, మీ జీవితంలో మీరు కూడా ఉదారంగా ఇస్తూ, దయా గుణాన్ని మరియు దాతృత్వాన్ని కలిగి ఉండండి. మీరు ఎంత ఎక్కువ ఇస్తే (ప్రేమ, శక్తి, సమయం లేదా భౌతిక సంపద ఏదయినా), అది అంత ఎక్కువగా మీరు మీ మూలం నుంచి పొందుతారు. దాతృత్వం లేదా దానం చేయడం అనేది సమృద్ధి యొక్క అనంతమైన స్వభావాన్ని ప్రతిబింబించే ప్రవాహాన్ని (స్వభావానికి తగిన ప్రవాహాన్ని ) మీ జీవితంలో సృష్టిస్తుంది.

**సానుకూల(Empowering) ఉద్దేశాలు**: మీ ఉద్దేశాలను అందరి యొక్క అత్యుత్తమ ప్రయోజనానికి అనుగుణంగా ఉంచండి. మీ చర్యలు ప్రేమ మరియు సేవల యొక్క మూలలతో ముడిపడినప్పుడు, ఎలా అయితే అక్షయ పాత్ర సదా అనంతమైన శక్తిని అందిస్తుందో, ఆ విధంగా సృష్టించగల-పోషించగల అనంతమైన శక్తి క్షేత్రంతో మీరు అనుసంధాన మవుతారు.

